'గేమ్ ఛేంజర్' విషయంలో బెదిరింపులు.. ఫిర్యాదు చేసిన చిత్ర బృందం

8 లో..


తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

## ఇదండీ..కబురు..




సంపుటి : 23 సంచిక : 30 | మంగళవారం జనవరి 14 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

## తెలుగు ప్రజలకు సీఎంల శుభాకాంక్షలు

### సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బాబు, రేవంత్



**కబురు,హైదరాబాద్ జనవరి 13:**
కొత్త ఏడాదిలో వచ్చే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ తొలిరోజు భోగి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు తెలుగు ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భోగిమంటలతో సమస్యలు తీరిపోయి ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలని ఇద్దరు సీఎంలు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికి సీఎం చంద్రబాబు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి మరొక్క మారు భోగి పండుగ శుభాకాంక్షలు.' అని ట్వీట్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలకు భోగి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు చెప్తూ ఇలా ట్వీట్ చేశారు. 'పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ, కొత్త కాంతులు పంచే భోగి మంటలు... ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని' ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ అధికారిక ఖాతాలో ట్వీట్ చేశారు.



## కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా
- చిరంజీవి, పలువురు కేంద్రమంత్రులు, నేతల రాక

**కబురు,న్యూఢిల్లీ,జనవరి 13:**
తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.

2 లో



## రోడ్డు భద్రత గురించి తెలుసుకోండి

### వాహనదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక

**కబురు,ఆసిఫాబాద్, జనవరి 13:**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు.. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహానాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు. అలాగే, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించింది. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, మితిమీరి వేగంతో వెళ్లరాదు అని పేర్కొన్నారు. దీంతో పాటు వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని మంత్రి సీతక్క చెప్పారు.



## మరెక్కడా లేని విధంగా తెలంగాణ పథకాలు

- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల ఖర్చు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**కబురు,ఖమ్మం,జనవరి 13:**
ప్రజా సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో ఉన్నటువంటి వంటి పథకాలు లేవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణం, ధాన్యం బోనస్ చారిత్రాత్మకమైన పథకాలు తెలంగాణ సర్కార్ ఇస్తుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసాకు 19 వేల కోట్ల రూపాయలు.. ఆత్మీయ భరోసాకు 2 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇక, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి స్కీంలో కన్ఫూజన్ ఏం లేదు.. పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం.. అలాగే, ఉపాధి హామీ పథకంలో సభ్యులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు అని వెల్లడించారు. ఇందులో సెంట్ భూమి లేని వారికి వర్తిస్తుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన స్పష్టత ప్రభుత్వం దగ్గర ఉంది. అధికారులు ఇందిరమ్మ కమిటీలు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు. గ్రామాల్లో గ్రామసభ దయాన్ ఏర్పాటు చేసి చర్చించాలి.. గ్రామాల్లో ముదు చోట్ల ఫ్లెక్సీలని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

### తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్



**కబురు,హైదరాబాద్ జనవరి 13:**
రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి రైతులు, వ్యవసాయానికి ప్రత్యేకమైన పండుగ అని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వ్యవసాయానికి పండుగ శోభ సంతరించుకుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. 'పండిన పంటల రాశు లతో ఇండ్లు కళకళలాడుతుంగా, రైతుల జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుంది. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది.

2 లో

## రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం ఫ్రీ



**కబురు,ఖమ్మం,జనవరి 13:**
రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం (జనవరి 13) రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాల అమలుపై ఖమ్మం కలెక్టరేట్‌లో ఉపముఖ్యమంత్రి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్?లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. నూతన రేషన్ కార్డుల జారీ అంశంలో అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని సూచించారు.ప్రతి సంవత్సరం సన్న బియ్యం మీద 11 నుంచి 12 వేల కోట్ల ఖర్చు చేయబోతున్నా మని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ, కార్డులలో నూతన సభ్యుల నమోదు వివరాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అన్నారు.



## పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోంది

- పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోంది
- మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన పొంగులేటి

**కబురు,ఖమ్మం,జనవరి 13:**
తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని రాష్ట గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందని అన్నారు.

మిగతాద్ది 2 లో



## వివాదరహితుడు, అతి సౌమ్యుడు మందా జగన్నాథం

### - మంద జగన్నాథానికి నివాళులర్పించిన మాజీ మంత్రి కేటీఆర్

**కబురు,హైదరాబాద్ జనవరి 13:**
వివాదరహితుడు, అతి సౌమ్యుడు మాజీ ఎంపీ, సీనియర్ రాజకీయ నాయకుడు మంద జగన్నాథం అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంద జగన్నాథ: పార్థివ దేహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మందా జగన్నాథం ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. జగన్నాథం మరణంతో తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయింది.

మిగతాది 2లో

## భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్



**కబురు,కరీంనగర్ జనవరి 13:**
హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా 35 మంది పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్ నుంచి కరీంనగర్ తీసుకెళ్లనున్నారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం



# సంక్రాంతి జరీచీర

ఏదో తప్పదు కావున పెళ్లి చేసి చేతులు దులుపుకున్నారనీ, సంక్రాంతికి పిన్నీ బాబాయిలు పుట్టింటి హోదాలో తననూ భర్తనూ పిలిచేదేమీ లేదనీ తేలిపోయాక చిన్నబుచ్చుకుంది ఆ కొత్త పెళ్లి కూతురు. భర్త గమనించాడు. వాళ్లు రాసినట్టే పిలిచినట్టే ఒక కార్డుముక్క సృష్టించాడు. పండక్కు ముందు భార్యను బయల్దేరదీశాడు. పట్నానికి తీసుకెళ్లి దర్జాగా హోటల్‌లో దించాడు. 'ఇదేమిటండీ' అని ఆశ్చర్యపోయింది భార్య. 'మరేటనుకున్నావోయ్. ఇంతకు మించిన పుట్టిల్లు లేదు. కోరిన టిఫెను, భోజనం గదిలోకే వస్తాయి. సాయంత్రమైతే సినిమాలు షికార్లు బోలెడన్ని. ఇదే నీ పుట్టిల్ల నుకొని సంతోషపడు' అంటాడు. మనసుంటే పండగ ఉండదా? మధురాంతకం రాజారాం 'పండగ అల్లుడు' కథ ఇది.చార్జీలు, పండగ ఖర్చులు తలచి పాపం ఆ పేద తల్లిదండ్రులు పెద పండుగ ఊసే ఎత్తలేదు కూతురి సంగతే మరిచినట్టు. అల్లుడు అది గమనించాడు. పండక్కు తన భార్య కొత్తచీర కట్టుకుంటే ఆ మురిపెం వేరు. సింగారమూ వేరు. కోర్టు గుమాస్తా అతను. చిన్న జీతమే. కాని పెద్ద మనసు. రిక్షా ఎక్కడం మానేశాడు. బయట టిఫెన్లు కాఫీలు మానేశాడు. నాటకాలు చూడ్డం మానేశాడు. పుస్త కాలు కొనడమున్నూ. ప్రతి పైసాను పొదుపు చేసి తెచ్చాడు ఆఖరుకు 'పుల్లంపేట జరీచీర'! పది హేను మూరల ఆ జరీచీర కట్టుకుని కళకళ్లాడిన భార్య 'ఇంత కష్టం చేసి నా కోసం తెచ్చారా' అని భర్త కంఠార తల ఆన్చి బాష్పాలు రాలుస్తుంది. సయోధ్య ఉంటే కాపరం పండగే. శ్రీపాద కథ ఇది.కరువు రోజుల్లో పండగంటే ఎంత కష్టం. ఇంటి పెద్ద మనసు కష్టపెట్టుకుంటూనే ఎక్కడ ఏది సర్ది చెప్పాలా అని ఆగమవుతూ ఉంటాడు. పిల్లలకిది పడుతుందా? పండగ మరో నెలుందనగానే తట్టలు పట్టి ఎక్కడి పేడంతా సేకరించి పిడకలు కొట్టి ఆరబెట్టారు. 'ఎన్నర్రా' అని తండ్రి అడిగితే '300' అన్నారు గర్వంగా. తండ్రికి ఎన్నో ఆలోచనలు. వాటిని పొయ్యిలోకి వాడితే కట్టెలైనా మిగిలి నాలుగు పైసలు ఆదా అవుతాయి గదా అని. 'ఇవ్వండ్రా' అనంటే 'ఊహూ'. భోగి మంటలేసి ఎగిసే మంటలను చూసి పక్కింటివాళ్లను ఓడిస్తేనే పిల్లలకు ఆనందం. పేదవాడికి పండగంటే 'సర్దుబాటే'. సాక్షాత్తూ ఆరుద్ర రాసిన కథ ఇది. అయితే 'ఇప్పటి భోగిమంటలు ఒక మంటలేనా' అంటారు ముళ్లపూడి వెంకట రమణ. జగన్నా థుని రథమంత ఎత్తున లేసేలా వేస్తేనే వేసినట్టట. 'ఒరే ఫ్రెండూ... వెళ్లి రెండు బైండింగ్ అట్టలైనా పట్టుకురారా మంట పెంచుదాం' అనంటే ఎవరింట ఉన్నాయట బైడింగ్ అట్టలూ పుస్తకాలూనూ. కోళ్లగంపలూ తాటాకు బుట్టలూ తప్ప. కావున జానెడు ఎత్తు మంటే జగన్నాథుడితో సమానం. అయితే పిల్లకారుకు చిన్న సరదా ఉందిలే. ఆ చిరుచీకట్లలో ప్లీడరు శేషయ్యగారి బోర్డు ఊడబెరికి మంటల్లో వేసి గోడ ఖాళీ ఎందుకని భోజనం తయార్ బోర్డు తెచ్చి అక్కడ వేళ్లాడదీశారు. పండగంటే పిల్లల అల్లరిది. జీవితాంతం చెప్పుకునేటందుకు జ్ఞాపకమై గూడుకట్టేది. ముళ్లపూడి 'భోగి మంటలు' బలే సరదా కథ. అయితే స్త్రీగళాన్ని ఎలా వదిలేస్తాం? ఒక సింగిల్ ఉమన్‌కు అందరూ గది అద్దెకిస్తారుగాని ఒకటే షరతు... రోజూ ఇంటి ముందర ముగ్గేయాలని. ఆ సింగిల్ ఉమన్ మంచి జర్నలిస్టు. ఆలోచనాశీలి. సమాజానికి పనికొచ్చే పనులు చేయగలిగినది. మించి తన జీవి తాన్ని తాను నిర్మించుకోగలిగేది. అయినా సరే. ముగ్గేయాల్సిందే. 'నాకు రాదు... వచ్చినా వేయను'... 'పనిమనిషితోనైనా వేయించు'... పండుగ నెల వచ్చిందంటే ఆమెకు గండం. ముగ్గు లేని వాకిలిగా ఆమె ఇల్లే కనపడుతుంది. ఆ నెల్లో యజమాని ఖాళీ చేయించడం ఖాయం. మరో గదికి చలో. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలట. ఇల్లాలి చదువు, జ్ఞానం, వికాసం వీటి వల్ల కాదా దేశానికి పండగ వచ్చేది? పి.రామకృష్ణారెడ్డి కథ 'ముగ్గు'.సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండగ. యుగాంతం వరకూ నిలిచే పండగ. సంస్కృతిని ఎప్పటికీ కాపాడుకోవాల్సిందే. కాని సందర్భాలలోని అంతరాలను చూసి సరిచేసి పండుగ అర్థాన్ని విశాలం చేసుకోవాలి కూడా. 'గుమ్మం ముందు బొబ్బిలిపాట గాళ్లేమిటి... బుడబుక్కల వాళ్లేమిటి... తందానపదం వాళ్లేమిటి... గంగిరెద్దల వాళ్లేమిటి... పగటి వేషగాళ్లేమిటి... తోలు బొమ్మలాళ్లేమిటి... ఎరకలాళ్లేమిటి... చెంచులాళ్లేమిటి... జంగాలేమిటి... సన్నాయి వాళ్లేమిటి... వీళ్లంతా నిమిష నిమి షానికి వచ్చేవాళ్లే' అని రాస్తారు కవికొండల వేంకటరావు 'మా ఇంట సంక్రాంతి' కథలో. పండగ ఒకరు చేసుకునేదిగా... మరొకరు వారింటి ముందుకు వచ్చి ఇనాము అడిగేదిగా ఎందుకు ఉండాలి? ఇనాము ఇచ్చే స్థాయిలో ఒకరు, పొందే స్థాయిలో ఒకరు ఉంటే అది న్యాయమైన సమాజమేనా? జన్మ అంతరాలు, ఆర్థిక అగాథాలనే కాబోలు భోగిజ్వాలల్లో పడేయాల్సింది. గాయకుడు పుట్టా పెంచల్దాసు 'యేటంబిడ యేడుచ్చా పోయా' అనే కథను రాశాడు. భోగి రోజు పండగ చేసుకోనీకుండా, ఇల్లు గడిచేందుకు భత్యాలు తీసుకురమ్మని తల్లి పోరుపెడితే, చీకటితో బయల్దేరి ఇంటింటా పాటలు పాడి గింజలు, వడ్లు తీసుకుని చీకటి పడ్డాక ఇల్లు చేరి, అప్పుడు కొత్త బట్టలు కట్టుకుని ఎవరికి చూపించుకోవాలో తెలియక దిగాలు పడే పసివాడి కథ అది. దుఃఖం వస్తుంది. సంక్రాంతి ఎంతో సంబరమైన పండగ. కాని సమకాంతికై అది చేసే వాగ్దానాన్ని మనం ఇంకా అందుకోవలసే ఉంది. సామాజికంగా అందరూ అడుగు పెట్టగలిగేదే ఉత్తరాయణం అంటే. క్రాంతి రావడమే సరైన సంక్రాంతి. అటువంటి సంక్రాంతిని కాంక్షిస్తూ గుమ్మడి పూల, పసుపు చేమంతుల శు భాకాంక్షలు!

# భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో మహేశ్వర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. తన పట్ల దురుసుగా ప్రవర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదుపై కౌశిక్‌రెడ్డిపై ఇంకో కేసును ఫైల్ చేశారు. ఈమేరకు వేర్వేరుగా మూడు కేసులను పోలీసులు నమోదు చేశారు.

# కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

మొదటిపేజీ తరువాయి

మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

# రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం ఫ్రీ

మొదటిపేజీ తరువాయి

అలాగే.. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 3500 ఇండ్లు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో పంపిణీ చేయనున్నామని చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి 12 వేలు అందిస్తామని, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఆహారభద్రత చట్టాన్ని దేశంలో ప్రవేశ పెట్టామని గుర్తు చేశారు.

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాలు 2025, జనవరి 26 నుండి ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రాంతంలో భారీగా నిధులు ఖర్చు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి అధికారులు ప్రజాప్రతినిధులు తీసుకుని వెళ్లాలని పిలుపునిచ్చారు.

# తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యతాంశంగా నాడు అమలు చేసిన కార్యాచరణ పదేండ్ల అనతికాలంలోనే సత్ఫలితాలు ఇచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు పటిష్ఠంగా అమలు చేశాం. తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రశంసలు అందుకుంది. దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపామని తెలిపారు. కుల వృత్తులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభను నింపింది. పదేండ్ల బీఆర్ఎస్ సర్కార్ వ్యవసాయరంగ అభివృద్ధి కోసం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. రైతుల జీవితాల్లో వెలుగు నింపాలనే దృఢ సంకల్పంతో ముందుకెళ్లాం. ఉమ్మడి రాష్ట్రంలో దండగన్న తెలంగాణ వ్యవసాయం బీఆర్ఎస్ హయాంలో పండుగలా మారింది. రాజకీయాలకు అతీతంగా రైతన్న సంక్షేమమే ధ్యేయంగా పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలి.' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

# పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోంది

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం కుసుమంచిలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ప్రారంభించారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటిని మంత్రి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేదల కల నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు. కేవలం పేదవారయితే చాలు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర పక్రియ అని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో పేదవాడికి తీయని కబురు చెబుతున్నామని అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయబోతున్నామని అన్నారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగబోతోందన్నారు. రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా రూ.12 వేలు రెండు విడతలుగా ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం

## - అదుపుతప్పి గోడను ఢీకొన్న బస్సు

**తిరుమల,జనవరి13 :**

తిరుమల రెండవ ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం నాడు హరిణి వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు భక్తులు, ఉద్యోగులకు గాయాలయ్యాయి. బస్సు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో దాదాపు ఎనిమిది కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకుని బస్సును రోడ్డుకు అడ్డం తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రేన్‌తో బస్సును తొలగించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. తిరుమలలో సోమవారం భారీగా వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డులో వస్తున్న ఆర్టీసీ బస్సు 12వ కిలోమీటర్ వద్ద హరిణికి సమీపంలో బ్రేక్ వేయడంతో అదుపుతప్పి అక్కడే ఉన్న రక్షణ గోడను ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, ఉద్యోగులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు రక్షణ గోడను ఢీకొట్టిన నేపథ్యంలో బస్సు పూర్తిగా రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరికాసేపట్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అయితే బస్సులో ప్రయాణిస్తున్న భక్తుల్లో కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. వారికి రుయా ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. తిరుమలలో వర్షం కారణంగా ఘాట్‌లో రోడ్డుపై వెళ్లే వాహనాల్లో ఆయిల్ రహదారిపై పడటంతో అదే సమయంలో అక్కడకు వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బ్రేక్ కొట్టగా.. బ్రేక్ ఫెయిల్యూర్ అయ్యి ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. అయితే ప్రమాదానికి గల పూర్తి కారణాలను అధికారులు వెల్లడించాల్సి ఉంటుంది. అయితే బస్సు డ్రైవర్ వేగంగా నడపడం, బ్రేక్ వేయడం వల్ల ప్రమాదం జరిగిందని బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చెబుతున్న మాట. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. బస్సులో ముందు వరసగా ఉన్న వారు తీవ్రంగా గాయపడగా.. వెనక కూర్చున వారు స్వల్పంగా గాయపడ్డారు. సడన్‌గా బ్రేక్ కొట్టడం వల్లే బస్సులో ముందు ఉన్న రాడ్‌కు కొట్టడంతో చాలా మందికి మూతిపైనే గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

# అనర్హులకు ఇళ్లు వస్తే కలెక్టర్లదే బాధ్యత

## - మంత్రి కోమటిరెడ్డి సున్నితంగా హెచ్చరిక

**ఖమ్మం,జనవరి13 :**

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపాటంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని తెలిపారు. అక్రమాలు జరుగకుండా చూడాలన్నారు.అలాగే, ప్రజా పాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు అని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి తెలిపారు. వారి కోసం ఒక్కొక్కటిగా పని చేసి పెడుతున్నాం.. ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లాంటి కార్యక్రమాలు జనవరి 26 నుంచి అమలు చేస్తామన్నారు. దీనికి గాను సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు.. దానికి మంత్రులు, అధికారులు అందరు హాజరయ్యారు.. ప్రతి అర్హుడైన పేదవాడికి న్యాయం జరిగేలా ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. అర్హుడైన ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తాం.. రెవెన్యూ మంత్రి కూడ ఖమ్మం జిల్లాకు చెందిన వాడే ఆయన దగ్గర ఉండి మరి మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారు.. 16 నుంచి 26 వరకు అధికారులు కష్టపడి, ప్రతి గ్రామానికి వెళ్ళి సర్వే చేయాలి.. పేదలకు ఇళ్లు అందేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# ఆకర్షణీయ ముగ్గులేస్తు అందరిని ఆకట్టుకున్న నేటి చిన్నారులు

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, జనవరి 13 :**





సంక్రాంతి పండగ అంటేనే మూడు రోజుల ముచ్చటైన పండగ మొదటి రోజున భోగి పండగగా జరుపుకుంటారు.ఈ బోగి పర్వదినం రోజున ప్రతి ఇంటి ముంగిళ్ళలో కల్లాపి చల్లి ఇంటి వాకిలి అందమైన ముగ్గుల(రంగవల్లి)తో మహిళామణులు,యువతులు, చిన్నారులు తమకు నచ్చిన ముగ్గులను రంగురంగులతో తీర్చిదిద్ది వారి ప్రతిభను చాటుకుంటారు.అయితే నేటి చిన్నారులు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న ప్రస్తుత ఈ కాలంలో నిజామాబాద్ జిల్లా కేంద్రం,గంగస్థాన్ ఫేస్ వన్ ఓ అపార్ట్మెంట్ లో నివాసముండే గౌతమ్ రెడ్డి,మేఘనల కుమార్తెలు అన్విత,ఆర్వీలు హైదరాబాద్ నుంచి తన తాతయ్య నానమ్మ వాళ్ళింటికి వచ్చిన సందర్భంలో భోగి సందర్భంగా అపార్ట్మెంట్ సంస్కృతికి భిన్నంగా ఉదయం లేచిన నుండే ఆ ఇద్దరు చిన్నారులు అందమైన రంగులతో కూడిన రంగవల్లికలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. అయితే పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్న నేటి యువత ఈ చిరునారులను చూసి ఎంతైనా నేర్చుకోవాల్సిన అవసరం ఉందంటూ పలువు చర్చించుకోవడం ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా తెలుగు వారి సంస్కృతి,సంప్రదాయాలను ప్రతి ఇంట్లో వారికి చిన్ననాటి నుండే అలవర్చాలని అపార్ట్మెంట్లోని పెద్దలు సూచించారు. పాశ్చాత్త పోకడలకు పోకుండా,కాలానికి అనుగుణంగా మన ముందుకు ఎన్ని సంస్కృతి సంప్రదాయాలు వచ్చినా మన తెలుగు సంస్కృతి,సంప్రదాయాలను మాత్రం ఎన్నటికీ మరచిపోవద్దని అపార్ట్మెంట్లోని పెద్దలు కోరుతున్నారు.

# కామ్రేడ్ అనసూయ పార్థివ దేహం మెడికల్ కళ శాలకు అప్పగింత

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 13 :**



ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర నాయకులు, మాజీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కర్నాటి యాదగిరి సహచరి కామ్రేడ్ అనసూయ (78) క్యాన్సర్ వ్యాధితో సోమవారం ఉదయం చనిపోయారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో కామ్రేడ్ అనసూయ పార్థివ దేహానికి సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా)పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయం ఎన్.ఆర్ భవన్,కోటగల్లీలో విప్లవ నివాళి అర్పించారు.అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వనమాల కృష్ణ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ కే. రమ మాట్లాడుతూ,కామ్రేడ్ కే.యాదగిరి జీవిత సహచరిగా జీవితాంతం విప్లవ పార్టీకి సేవలందించిన కామ్రేడ్ అనసూయకు కమ్యూనిస్టు విప్లవకారులకు ఆదర్శమన్నారు.కామ్రేడ్ యాదగిరి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి,ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాత జీవితంలోకి వెళ్ళినా,కుటుంబ భారాన్ని అనసూయక్క నిర్వహించిందన్నారు.కామ్రేడ్ యాదగిరి సహచరిగానే కాకుండా పార్టీ సభ్యురాలిగా మహిళా సంఘం నాయకురాలిగా విప్లవజమానికి చేదోడు వాదోడుగా ఉందన్నారు.చివరికి చనిపోయిన తర్వాత కూడా తన కళ్ళను లయన్స్ క్లబ్ వారికి,శరీరాన్ని ప్రభుత్వం మెడికల్ కాలేజీకి ఇచ్చి వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడిందన్నారు.సంతాప సభ అనంతరం కామ్రేడ్ అనసూయ కుటుంబ సభ్యులు,బంధువులు,సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ శ్రేణులు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వరకు ర్యాలీగా వెళ్లి కామ్రేడ్ అనసూయ పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు,పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎస్ఎల్ పద్మ,వి.ప్రభాకర్,న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య,సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సీఎల్సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రవీందర్,సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు ఎం.నరేందర్, పి.రామకృష్ణ,ఎం.వెంకన్న,ఎం.సుధాకర్,బి.దేవారం డి.రాజేశ్వర్,సాయన్న,గంగన్న,ముత్తెన్న,మల్లేష్,కిషన్,మ ంరళి,సత్యక్క,గోదావరి గణేష్ రమేష్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వారధి

కబురు తెలుగు దినపత్రిక

## కబురు నూతన క్యాలెండర్ 2025ను ఆవిష్కరించిన అధ్యక్షులు రామకృష్ణ...

**కబురు న్యూస్,నిజామాబాద్, జనవరి 13 :**





మీడియాలోని పత్రికా రంగంలో ప్రజా సమస్యల పట్ల కబురు తెలుగు దినపత్రిక వారధిగా నిలిచిందని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అంతడుపుల రామకృష్ణ అన్నారు. సోమవారం రోజున ప్రెస్ క్లబ్ వద్ద కబురు తెలుగు దినపత్రిక నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు.ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా నిలుస్తూన్న కబురు దిన పత్రిక ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాదరణ పొందటం అభినందనీయం అని ప్రెస్ క్లబ్ అద్యక్షులు అంతడుపుల రామకృష్ణ అన్నారు. సోమవారం నగరంలో ప్రెస్ క్లబ్ లో కబురు సిఇఓ ఆధ్వర్యంలో కబురు దినపత్రిక ఆంగ్ల నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కబురు దినపత్రిక ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల ఆదరాభిమానాలు, మన్ననలు పొందడం గర్వకారణమన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్తా కథనాలు రాస్తూ మరింత ఉన్నత స్థానాన్ని సంపాదించుకోవాలని అన్నారు. కబురు దినపత్రిక అంటే తెలియని వారుండరని,మిత్రుడు ఎడిటర్ అండ్ సిఎండి శివకుమార్ ఆధ్వర్యంలో ప్రజల్లోకి మరింత దూసుకుపోయిందన్నారు.ఈ సందర్భంగా యాజమాన్యానికి,సిబ్బందికి,పాఠ కులకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి సందీప్,సీనియర్ జర్నలిస్టులు కొట్టూరు శ్రీనివాస్,గుండాజి శ్రీనివాస్,ఫ్రైమ్ నైన్ రాజేష్,సదానంద్,హైమద్,కర్క రమేష్,భూమేష్,అమ్మ శ్రీనివాస్,టీ న్యూస్ అరుణ్, ప్రెస్ క్లబ్ పీఆర్వో ప్రసాద్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న అంకం జ్యోతి ఫౌండేషన్

**కబురు న్యూస్,భీంగల్,జనవరి 13 :**



నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలానికి చెందిన అంకం జ్యోతి ఫౌండేషన్ సీఈఓ జ్యోతి తన భర్త సంతోష్ కుమార్ సోమవారం రోజున కొండూరు గ్రామానికి చెందిన గణపురం చంద్రబాగా అనే అమ్మకు సరుకులు అందజేశారు.గత కొన్ని సంవత్సరాలుగా పక్షవాతంతో మంచానికి పరిమితమై బాధపడుతున్న ఆమెకు తినడానికి కష్టంగా ఉందని సమాచారం అందుకున్న ఫౌండేషన్ వారు వెంటనే లండన్ లో ఉంటున్న తమ్ముడు వెంకటేష్ సమాచారమందించగా అనారోగ్య బారిన పడిన ఆమెకు సరిపడ వంట సరుకులు,బియ్యం సంచి అందించడం జరిగిందని తెలిపారు.తెలపాగానే వెంటనే తోచినంత సహాయం అందించిన వ్యక్తికి అంకం జ్యోతి ఫౌండేషన్ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# నిజామాబాద్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంటుగా ప్రొ.డా.శ్రీనివాస్

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 13 :**



నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా ప్రొ.డాక్టర్ శ్రీనివాస్ నియమితులయ్యారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.నిజామాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రికి రెగ్యూలర్ సూపరింటెండెంట్ లేకపోవడంతో ఇంచార్జీగా ప్రొ.డా.ప్రతిమారాజ్ నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు.హైదరాబాద్ లో పనిచేస్తున్న పిల్లలవైద్య నిపుణులు ప్రోఫేసర్ పి.శ్రీనివాసును ఇంచార్జీ సూపరింటేండేంటుగా నియమించారు.రెండ్రోజుల్లో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# హనుమాన్ నగర్ నూతన కమిటీ ఏర్పాటు



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, జనవరి 13 :**

నగరంలోని అమ్మ వెంచర్ లొ హనుమాన్ నగర్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అమ్మ నగర్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ అభివృద్ధికి పాటు పడాలని సోమవారం జరిగిన సమావేశంలో కోత్త కార్యవర్గంను ఎన్నుకుని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.నూతన కమిటీ అధ్యక్షులుగా యెండల కిషన్,అసోసియేటడ్ అధ్యక్షులుగా మాడవేడి వినోద్ కుమార్,గౌరవ అధ్యక్షులుగా దగ్గుల మధుసూదన్,ప్రధాన కార్యదరర్శిగా బొబ్బిలి కిషన్,కోశాధికారిగా మహేందర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా దొంతుల సందీప్,ఉపాధ్యక్షులుగా ప్రవీణ్,సంయుక్త కార్యదర్శులు రవి,రాజు,శ్రీనివాస్ ,ఈశ్వర్ లను ఎన్నుకున్నారు.

# బిసి నాయకులు రాజా నరేందర్ గౌడ్ ను సన్మానించిన బీసీటీయూ



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 13 :**

రాష్ట్ర ప్రాంతీయ రవాణా సంస్థ అథారిటీ సభ్యుడిగా నియమితులైన బిసి నాయకులు రాజా నరేందర్ గౌడ్ వారి స్వగృహంలో సోమవారం బీసీటీయూ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శాలువా పూల బొకేతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ జిల్లా ప్రధాన కార్యదర్షి రాఘవాపురం గోపాలకృష్ణ,గౌరవ సలహాదారులు రమణ స్వామి,ఇందల్వాయి మండల బిసిటియు అధ్యక్షులు గంగా మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉండాలి.. కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు

**కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 13**



రాష్ట్రంలోని ప్రజలు రైతులు మకర సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మకర సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపి ఆనందంగా ఉండాలన్నారు.

# జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,జనవరి 13 :**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.భోగభాగ్యాలనిచ్చే భోగి,సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ ఆనందం పంచాలని ఆకాంక్షించారు.నూతన సంవత్సరంలో అన్నీ శుభాలే సమకూరాలని, అనుకున్న పనులన్నీ నెరవేరాలని, ఏడాది పొడుగునా ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలషించారు.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న పోచారం



కబురు న్యూస్ బీర్కూర్, జనవరి 13

బీర్కూరు మండలంలోని గ్రామ శివారు గల తెలంగాణ తిరుమల దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోధ రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని పల్లకి మోశారు. ఈ కార్యక్రమంలో పోచారం శంభు రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయవాదిని మర్యాద పూర్వకంగా కలిసిన మస్జిద్ కమిటీ సభ్యులు

కబురు న్యూస్, బాన్సువాడ, జనవరి 13



బాన్సువాడ పట్టణంలోని ఇస్లాంపురా కాలనీ మర్కజ్ -ఏ - ఆహేలేసున్నతుల్ జమాత్ మస్జిద్ -ఏ - నూర్ కమిటీ అధ్యక్షుడు షేక్ నయీమ్ రజ్వి ఆధ్వర్యంలో సోమవారం హైకోర్టు న్యాయవాది మొయిన్ ఆహేమద్ ఖాద్రి ను లింగంపేట్ మండల కేంద్రంలోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నూర్ కమిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇషాక్, కార్యదర్శి అబ్దుల్ రజాఖ్, మత పెద్దలు మహబూబ్,,కమిటీ సభ్యులు సయ్యద్ అత్తర్, హష్మీ, తదితరులు పాల్గొన్నారు...

## బోధన్ లో గల్లీ క్రికెట్ టోర్నమెంట్...





కబురు న్యూస్,బోధన్ జనవరి 13..

బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారీ నవీన్ ఆధ్వర్యంలో గల్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన పోటీలలో అండర్14 3టీమ్ లు చిన్నారులు, 4టీమ్ లుగా యువకులు ఉత్సాహంగా క్రికెట్ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము శరత్ రెడ్డి, గంగాశంకర్, దాము ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచన మేరకు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఇమ్రాన్, మీర్ నజీర్ అలీ, పిట్ల సత్యం, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

## శివ మందిరంలో ప్రత్యేక పూజలు...



కబురు న్యూస్,బోధన్ జనవరి 13..

బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సోమవారం పురస్కరించుకొని ఉదయం నుండి భక్తులు ఆలయానికి విచ్చేసి ఆలయ అర్చకులు గణేష్ మహారాజ్, మహేష్, శివ కుమార్ ల వేద మంత్రోచ్చారణాల నడుమ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు "ఇందిరమ్మ ఆత్మీయ భరోసా"

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,జనవరి 13 :



గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయనుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ నుంచి ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తెస్తోందని అన్నారు. అర్హులైన కుటుంబాలకు రెండు విడతలలో రూ.6 వేలు చొప్పున ప్రతీ సంవత్సరం రూ.12,000 నేరుగా వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు అయి ఉండి, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. భూభారతి (ధరణి) పోర్టల్ ఆధారంగా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలను నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని భూమి లేని అర్హత కలిగిన వ్యవసాయ కూలీ కుటుంబాలన్నింటికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించేలా సంబంధిత అధికారులను ఆదేశించామని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలలో లబ్దిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపించిన మీదట తుది జాబితాను ఆమోదించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ గ్రామ సభలో ఏవైనా అభ్యంతరాలు వచ్చినట్లైతే, సంబంధిత ఎంపీడీఓ వాటిని పరిశీలించి, నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తారని అన్నారు.

# ఇందూర్ లోనే పసుపు బోర్డు

- నేడు పర్చువల్ గా ప్రారంభించనున్న కేంద్ర మంత్రి...
- పసుపు బోర్డు చైర్మన్ గా పల్లె గంగారెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, జనవరి 13 :



2023లో ఎన్నికల సందర్భంగా తెలంగాణకు వచ్చిన మోడి పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏడాది కాలంగా దాని కోసం ఎదురు చూస్తుండగా మహారాష్ట్రకు పసుపు బోర్డు తరలిస్తారని ఊహాగానాలు వచ్చాయి. కానీ వాటిని పటాపంచలు చేస్తూ పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తూ కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశంలో మోడి ప్రకటన చేయడం చకచక జరిగింది. సోమవారం పండుగ పూట ప్రకటన రాగానే సంక్రాంతి నాడే పర్చువల్ గా జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్ లో ఏర్పాటయ్యే దానిని స్వయంగా కేంద్ర పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ పర్చువల్ గా ప్రారంభించనున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పడనున్న జాతీయ పసుపు బోర్డుకు తొలి చైర్మన్ గా ఆర్మూర్ కు చెందిన సీనియర్ బీజేపీ నేత, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లె గంగారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఎక్కడా ఏర్పాటు చేస్తారనేది ఇప్పటి వరకు ప్రకటన రాకపోయినప్పటికీ బోర్డు ఏర్పాటు అనేది ఖాయం కాగా పాలకవర్గం, అధికారుల నియామకాలు కూడా జరుగనున్నాయి. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు ప్రధానంగా గిట్టుబాటు ధరతో పాటు నూతన వంగడాలతో సాగు, ఎగుమతులు, దిగుమతులకు ఆస్కారం ఏర్పడనుంది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సమయంలో 170 మంది రైతులు కూడా పసుపు బోర్డు ఏర్పాటు మద్దతు కోసం పోటీ చేసి నాటి సీఎం కేసీఆర్ కూతురు ఎంపీ కవితను ఓడించిన విషయం విధితమే. ఆనాడు నుంచి పసుపు బోర్డు అంశం రేపుమాపు అంటూ వాయిదా పడుతూ వస్తుంది.

# బాన్సువాడ అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చిన ఘనత పోచారందే.... నాయకులు అంజిరెడ్డి, కాలేక్

- రాష్ట్రంలో అన్ని వర్గాలను బలోపేతం చేస్తున్న ప్రభుత్వం... మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్

కబురు న్యూస్, బాన్సువాడ, జనవరి 13



బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలు అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వంలో మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కష్టపడి నిధులు తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో ఉందని కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, కాలేక్ అన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ బహిరంగ సభలోనైనా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతోనే బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని బాహాటంగా చెప్పారని, నియోజకవర్గ ప్రజల సంక్షేమంతో పాటు మరింత అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. గత 47 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీలు మారారు తప్ప ఎక్కడ స్వార్ధ రాజకీయ కోసం కాదనే సంగతి ఎమ్మెల్సీ కవిత గుర్తుంచుకోవాలన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలోని గురుకుల విద్యార్థులకు మెస్ కాస్మెటిక్ చార్జీల పెంపు... జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్**

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పనిచేస్తున్నారని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్ అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రిగా, స్పీకర్గా పనిచేసిన అనుభవంతో పాటు సీనియర్ నాయకునిగా ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారాన్నారు. రాష్ట్రంలో గురుకులాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించడం కోసం మిస్ చార్జీలను, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదన్నారు. ఎమ్మెల్సీ కవిత మరోసారి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు సహించరని సంగతి మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నార్ల రవీందర్ గుప్తా, నార్ల సురేష్ గుప్తా, ఎజాస్, గోపాల్ రెడ్డి,మోహన్ నాయక్, దాసరి శ్రీనివాస్, మాసాని అశోక్ రెడ్డి,షాహెబ్,అఫ్రోజ్, వాహబ్, రహీం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి...

- మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు....
- వాహన ధ్రువ పత్రాలు తప్పనిసరి...
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం...
- ఎస్ ఐ రవి...

కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 13

ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు తప్పక పాటిస్తూ వాహనాలను నడపాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపెల్లి రవి వాహనదారులను ఆదేశించారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండలం, కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడికల్ గ్రామంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం. అవగాహన సదస్సు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ రవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చట్టాలను అమలు చేయడం జరుగుతుందని ప్రజా రక్షణ కోసం ప్రతి ఒక్క వాహనదారుడు , భద్రత పాటిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, వాహనాలను నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే, మైనర్ లకు వాహనాలను ఇచ్చినట్లయితే, డ్రైవింగ్ ప్రమాదకరం అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వాహనదారునిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరంగా చర్యలు తప్పవని, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తప్పకుండా కలిగి ఉండాలి, పోలీసుల తనిఖీల్లో వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించడం జరుగుతుందని, నిబంధనల మేరకు వాహనాలను నడిపి సురక్షితంగా ఉండి కుటుంబాలను సంతోషంగా ముందుకు నడిపించుకోవాలని ,వాహనదారులకు జాతీయ రోడ్డు భద్రోత్సవాల మాసోత్సవంలో భాగంగా ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఎస్ ఐ రవి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణాలు కొనసాగించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో ప్రజా పాలన...

- తప్పుడు ప్రచారాలు మానుకో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి...
- చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం....
- బిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దు.....
- రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ....
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం...
- హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రజక...




**కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 13**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారని,తప్పుడు ప్రచారాలు మానుకో హుజురాబాద్ బి ఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, చివరి ఆయకట్టు వరకు రైతులకు నిరంధిస్తామని హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి రజక హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హితవు పలికారు. సోమవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు తిరుపతి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రజక నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారంటీలతో పాటు, రైతు సంక్షేమం కోసం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రైతును ఆర్థికంగా ఎదిగేందుకు దశలవారీగా నిధులను విడుదల చేసి రైతుకు అండగా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము అహర్నిశలు కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, మతిభ్రమించి కాంగ్రెస్ పార్టీ ని అవాస పాలు చేసేందుకు హుజురాబాద్ శాసనసభ్యులు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే వాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ ప్రాంతంలో సాగునీరు అందదని రైతులను అయోమయానికి గురి చేస్తున్నాడని రైతులు హుజురాబాద్ ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాటలను నమ్మవద్దని చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అదించి, రైతులకు అండగా ఉంటామని, శాసనసభ్యుడు అయి ఉండి కూడ అధికారులను, సంప్రదించకుండా వారి సమాచారం తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాన్ని మీడియా ముందు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము రైతు పక్షపాతి రైతు ఆర్థిక వృధాలే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, రైతులు ఎలాంటి దిగులు చెందవద్దు అని రైతులకు భరోసా కల్పించారు. జిల్లాకు చెందిన రవాణా ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ గౌడ్, కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు ఎస్సారెస్పీ కాలువ నీటి విడుదల కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారని, అది చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీని అభాసుపాలు చేయాలని తాపత్రయంతో హుజురాబాద్ ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రైతులకు సాగునీరు ప్రభుత్వం విడుదల చేయదని తాను షట్టర్లు పగలగొట్టి సాగునీరందిస్తానని తప్పుడు ప్రచారం చేయడం. రైతులు నమ్మవద్దని, ఒక గుంట వేసిన పంట ఎండకుండా చివరి ఆయకట్టు వరకు పంట పూర్తయ్యే వరకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా రైతులకు సాగును రమ్మిస్తామని తిరుపతి ఈ సందర్భంగా వెల్లడించారు. ఎమ్మెల్యే హెూదాలో ఉండి పాడి కౌశిక్ రెడ్డి రైతులను అయోమయానికి గురిచేస్తూ కాంగ్రెస్ పార్టీని అభాసుపాలు చేయాలని మీడియా ముందు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికైనా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తిరుపతి రజక హెచ్చరించారు. ఈ సమావేశంలో హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సదానందం, కిరణ్ రెడ్డి, బిక్షపతి, చాంద్ పాషా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా



**కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గశివంపేట్ మండల్ సీతారాం తాండా గ్రామ పంచాయతీలో పద్మావత్ లచ్చిరాం, అనరోగ్యం బాగాలేక మృతి చెందాడు ఆ కుటుంబాని పరామర్శించిన ప్రముఖ సంఘాసేవకులు తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా అలాగే వారి సొంత నిధులనుండి పదివేల 10000. రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో శివంపేట తాజా మాజీ ఉపసర్పంచ్ పద్మ వెంకటేష్, సీతారం తండా, గ్రామ శాఖ అధ్యక్షులు రాజేందర్ నాయక్, మహేందర్ విజయ్ అజయ్ మోహన్ రామ్ సింగ్ సక్రు నాయక్ వెంకట్ టిఆర్ఎస్ కార్యకర్తలను తదితరులు పాల్గొన్నారు

## చైనా మాంజాకు దూరం ఉండండి తాజా మాజీ ఉపసర్పంచ్ అశోక్.

**కబురు న్యూస్, దినపత్రిక మెదక్ నర్సాపూర్.**





సంక్రాంతి వేళ గాలిపటాలు ఎగరేడానికి చైనా మాంజా వద్దొదని రెడ్డిపల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ అన్నారు.సంక్రాంతికి ముందే చైనా మాంజా మెడ మీద కత్తిలా వేలాడుతోందనే విషయం అందరూ గమనించి తీరాలి. సింథటిక్, నైలాన్ తదితర పదార్థాలతో తయారైన చైనా మాంజా అంత త్వరగా తెగదు. ఇది పదునుగా ఉండటం వల్ల గాలిపటాలు ఎగిరేసేటప్పుడు ఎన్నో ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికే ఎందరో చైనా మాంజా ఎఫెక్ట్‌తో ప్రాణాలు కోల్పోయారు. సంక్రాంతి సెలవులలో తమ తమ పిల్లలను జాగ్రత గా చూసుకోండి. గాలి పటం ఎగర వేసేటప్పుడు దాబాల పైన గాని మరి ఎత్తు ప్రదేశంలో పిల్లలు ఎక్కుతున్నారు దానివల్ల విద్యుత్ తీగల కు తగిలి మరియు ఎత్తు ప్రదేశం నుంచి జారిపడి అనేకమంది పిల్లల ప్రాణాలు బలి కావడం జరుగుతుంది. తమ తమ పిల్లలు చాలా విలువైన ఆస్తిగా భావించాలి వారిపట్ల నిర్లక్ష్యం చేయరాదు. రానున్న మూడు నాలుగు రోజులు మన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. మనుషుల, మూగజీవాల ప్రాణాలతో పాటు పర్యావరణానికి హాని కలిగించే చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముంది.

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేసిన మిత్రబృందం...

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 13.**



వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గంగిపల్లి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుమారుడి స్నేహితులు, ఆ కుటుంబానికి సోమవారం క్వింటల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలువేరి రమేష్, రాధారపు తిరుపతి , తాళ్లపల్లి శ్రీనివాస్, పొన్నం రవీందర్, గాజుల రవీందర్, నీల కుమార్ తదితరులు అందజేశారు.

## గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితుడికి 55 లక్షల పరిహారం

- యాబ్ లీగల్ సర్వీసెస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపిన రాజా కుటుంబ సభ్యులు...



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,జనవరి 13 :**
గల్ఫ్ లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితుడికి 55 లక్షల పరిహారం యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవో సలాం పాపినిస్సేరి అందజేశారు.వివరాలు ఇలా ఉన్నాయి.నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలం జ్యాగిర్యాల గ్రామానికి చెందిన గద్దల రాజా 2022 డిసెంబర్ 27 న షార్జ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండస్ట్రియల్ ఏరియాలోని అనధికార స్థలంలో రోడ్డు దాటుతుండగా పాకిస్తాన్ కు చెందిన వాహనదారుడు ఢీ కొట్టాడు. ప్రమాదం జరిగిన వెంటనే గద్దల రాజాను షార్జా ఆల్ ఖాసిమియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందడం జరిగింది.మరణించిన గద్దల రాజా పై రహదారి దాటినందుకు అభియోగం మోపడం ద్వారా కేసును ముగించారు.ఆ సమయంలోనే గద్దల రాజా అతని బంధువైన రాజారాం,గద్దల రాజన్న వారసులు యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవో సలాం పాపినిస్సేరి కేసును అప్పగించడం జరిగింది. రోడ్డు దాటుతున్న పాదదారులను పట్టించుకోకుండా వాహనం నడిపిన పాకిస్తానీ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాబ్ లీగల్ సర్వీసెస్ న్యాయవాదులు కోర్టులో కేసు నమోదు చేశారు.దీంతో షార్జ కోర్టు లో తిరిగి కేసు నమోదు చేయడం వల్ల యాబ్ లీగల్ సర్వీసెస్ న్యాయవాదులు చేసిన కృషి ఫలింతంగా రాజు కుటుంబానికి నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవో సలాం పాపినిసిపిరిని సోమవారం నిజామాబాద్ జిల్లా లోని జ్యాగిర్యాల్ విచ్చేసి మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి గత 15 సంవత్సరాలుగా మాయబ్ లీగల్ సర్వీసెస్ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూదన్నారు.న్యాయం జరిగే విధంగా కృషి చేస్తున్నామని, సగటు భారతీయుడికి సౌదీ,అరబ్,ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వారు యబ్ లీగల్ సర్వీసెస్ కు ఆశ్రయించిన మరో క్షణం నుంచి న్యాయం జరిగే విధంగా పనిచేస్తామన్నారు.ఈరోజు నిజామాబాద్ రావడం రాజు కుటుంబానికి డబ్బులు అందజేయడం మాకు ఎంతో ఆనందంగా కలిగించిందన్నారు.యాబ్ లీగల్ సర్వీసెస్ సీఈవోతో పాటు అరబ్ కంట్రీ సంస్థ సభ్యుడు షేక్ ఆల్ అజీజ్, అబ్దుల్ రావుఫ్. మునీత్ తదితరులు ఉన్నారు.

## మొలంగూర్ లో భూమి ఆక్రమణ...

- ఆక్రమణ భూమి సర్వే కోసం శాఖ పరంగా చర్యలు..
- గణేష్ కు హామీ ఇచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం...
- మొలంగూర్ క్షేత్రస్థాయి పర్యటనకు వస్తా... ఎమ్మెల్సీ కోదండరాం...





**కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 13**
ఆక్రమణకు భూమైన ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి , శాఖ పరంగా చర్యలు తీసుకునే అందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డి జేఏసి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చినట్లు వెలుగునీడ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, మొలంగూర్ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు మోరె గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని సర్వే నంబర్ 703,378 ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, పాలకులతో పటు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి డాక్టర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, తోపాటు రెవెన్యూ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మొలంగూర్ గ్రామంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాలు నిర్మాణం చేసి, గ్రామంలోని ఎస్సీ ,ఎస్టీ బీసీ, మైనారిటీ భూమి, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మాణం చేసి అందజేయాలని, తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ను హైదరాబాదులో పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఓ వినతిపత్రం అందజేసి, పేదలకు న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన, మొలంగూర్ గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి ప్రత్యేక చర్యలు తీసుకొని గ్రామంలోని భూమి ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మాణం చేర్చుటకు శాఖపరంగా తన వంతు సహాయ సహకారాలు అందజేసి పేదలకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చినట్లు గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జన సమితి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి అరికెల స్రవంతి, యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కర్రీ సతీష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

# ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి.

## – రామగిరి ఎస్ఐ చంద్రకుమార్

**జాతీయభూమి రామగిరి ప్రతినిధి జనవరి 13**

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని రామగిరి మండల ఎస్సై చంద్రకుమార్ అన్నారు. సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, డైరెక్టర్స్ , మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి గారు విన్యూత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా యమధర్మరాజు వేషధారణతో వాహన చోదకులు వాహనంపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ధరించనివారు తమ వెంటనే ప్రమాదం ఉందని తెలుపుతూ, ధరించిన వారికి పూలు ఇచ్చి అభినందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగిరి ఎస్సై చంద్రకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు లయన్స్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు అలాగే ప్రజలు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రోడ్డు భద్రతా చర్యలు పాటించకపోవడమే ఇలాంటి






ప్రమాదాలకు ప్రధాన కారణం. రాంగ్ సైడ్ డ్రైవింగ్, రోడ్డు భద్రతా నియమాలు లేకపోవడం, చర్యలు, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం మొదలైన వాటి వల్ల రోడ్డు ప్రమాదాల గురించి మనం ఎప్పుడూ వార్తల్లో లేదా మా స్నేహితుల ద్వారా వింటూనే ఉంటాం. చాలావరకు ప్రమాదాలు హెల్మెట్ ధరించకపోవడం వలన జరుగుతున్నాయని కాబట్టి ప్రతి ఒక్కరు తమ కుటుంబం గురించి ఆలోచించి హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఒకవేళ ఇచ్చినట్లయితే ఏదైనా జరిగితే మైనర్లపై మరియు వాహన యజమానిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా మద్యం తాగి వాహనం నడపడం చాలా ప్రమాదకరం మీతో పాటు తోటి వారికి కూడా నష్టం చేకూరుస్తుంది. వాహనం నడిపేటప్పుడు అన్ని రకాల పత్రములను వెంట ఉంచుకోవాలని తెలిపారు. అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదంతో కుటుంబం చిన్న భిన్నం అయ్యే అవకాశం ఉందని కావున అందరూ రోడ్డు భద్రత నియమాలను పాటించి సురక్షితంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య మారుతి యాదవ్, కళాదర్ రెడ్డి వీరితో పాటు పోలీసు సిబ్బంది శ్రీనివాస్,చంద్రమౌళి, రాజ్ కుమార్,క్లబ్ సభ్యులు శ్రీనివాస చారి, సురేష్ మరియు సింగరేణి యువ బలగం సభ్యులు క్రాంతి, సంతోష్ ,శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో భోగి పండుగ



**కబురు న్యూస్, రామగిరి జనవరి 13.**

రామగిరి మండలం సెంటినరీ కాలనీలో సింగరేణి యువబలగం ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో టీటూ ఫస్ట్ లైన్ లో కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం యువబలగం టీం సభ్యులు మాట్లాడుతూ మకర సంక్రాంతి పండుగకు ముందు రోజు వచ్చే భోగి పండుగ సందర్భంగా పిడకలను, కట్టెలను పాత వస్తువులను భోగి మంటల్లో వేడుకలను ప్రారంభిస్తారు. ఈ భోగి మంటల్లో మీ యొక్క పీడల్ని బాధల్ని చేసి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బూడిగె క్రాంతి,మేకల మారుతి,సతీష్,గుండం సురేష్, సదానందం, హరిబాబు, అఖిల్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డి పై హుజురాబాద్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు..

**కబురు న్యూస్,హుజురాబాద్ జనవరి 13**

- రాజకీయాల్లో హుందాగా ఉండాలి.
- జగిత్యాల ఎమ్మెల్యే పై దాడి హేయనీయమైన చర్య.
- దాడిని ఖండించిన హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణులు.




సహాచర జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు హేయమైన చర్య అని హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణులు అన్నారు.ఈ మేరకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో అతనిపై ఫిర్యాదు చేశారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రులు,ఎమ్మెల్యేల పట్ల కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు,వాడిన పదజాలం సరిగా లేదని ప్రజా సమస్యల పట్ల నిర్వహిస్తున్న సభలో గందరగోళం సృష్టించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందకుండా చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.చట్టప్రకారం అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి,మండల అధ్యక్షుడు కిరణ్,హనుమాన్ దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్,మహిళా అధ్యక్షురాలు పుష్పలత,మండల అధ్యక్షురాలు లావణ్య,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి,డైరెక్టర్ కిరణ్ రెడ్డి,సదానందం,తిరుపతి,బాబు,నరేష్ మైనారిటీ సెల్ టౌన్ అధ్యక్షుడు అఫ్సర్,సీనియర్ నాయకులు బాబు,నరేష్,కిరణ్ రెడ్డి,పోషయ్య, నరసింహ రెడ్డి,చాంద్ పాషా, ఖాలిద్, ఉప్పు శ్రీను, అలీం మల్లిక,అనిల్,వినోద్, సాంబయ్య,ఐలయ్య,యూత్ కాంగ్రెస్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డి కి కల్వకుంట్ల కుటుంబంపై ఉన్న ప్రేమ హుజురాబాద్ ప్రజల పై లేదు..ప్రణవ్.

**కబురు న్యూస్, హుజురాబాద్ జనవరి 13**

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పై దాడిని ఖండిస్తున్న.
- హుజురాబాద్ ప్రజల పరువు తీస్తున్నాడు.
- కౌశిక్ రెడ్డి తీరును కేటీఆర్,హరీష్ రావు సమర్థిస్తారా?
- ఇలాంటి గుండాయిజన్ని ప్రోత్సహిస్తుంది బిఆర్ఎస్ పార్టీ కాదా?
- కేటీఆర్,హరీష్ రావు మీ ఎమ్మెల్యేని మెంటల్ హాస్పిటల్ లో చేర్పించండి.
- నియోజకవర్గ అభివృద్ధిపై నీకు సోయి లేదు.
- ఫిరాయింపులపై మాట్లాడే అర్హత లేదు.
- మొగోడివైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్.పోటి చేస్తే ఎవరి సత్తా ఎంటో తెలుస్తది.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన దాడిని ఖండిస్తున్నట్లు,పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాంటి చిల్లర పనులు ఏరోజు చేయలేదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు.వారు మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై గగ్గోలు పెట్టే ఎమ్మెల్యే తను ఏ పార్టీ




నుంచి ఫిరాయించి బిఆర్ఎస్ లో చేరాడో తెలుసుకోవాలని సూచించారు.సంవత్సరం గడుస్తున్నా కౌశిక్ రెడ్డికి అధికారం మదం ఇంకా తగ్గలేదని దమ్ముంటే హుజురాబాద్ లో రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు.ఈ సవాల్ స్వీకరించి ఎమ్మెల్సీగా,విప్ గా ఉన్న సమయంలో హుజురాబాద్ అభివృద్ధికి ఏం చేశారో,గడిచిన సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించి ఎన్నికలకు పోదామని తెలిపారు.ఎమ్మెల్యే పదవి పరువు తీస్తున్నాడని,చనిపోతా అంటే ఓట్లు వేసినా హుజురాబాద్ ప్రజల పరువు తీస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో హుజురాబాద్ నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత పరువు నిలబెట్టేలా వ్యవహరించారే తప్ప ఇలాంటి చిల్లర పనులు చేసి హుజురాబాద్ పరువు తీయలేదని అన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ,ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రజా సమస్యల వినిపించాల్సిన కౌశిక్ రెడ్డి అధికారులతో,నాయకులతో గొడవలు పెట్టుకుని హుజురాబాద్ కు రావాల్సిన నిధులను కూడా రాకుండా చేస్తున్నాడని ఇలాంటి చర్యలు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం సమర్థిస్తుందా? అని ప్రశ్నించారు.హుజురాబాద్ లో గతంలో చెప్పినట్టుగా చివరి ఆయకట్టు వరకు తాము సాగునీరు అందిస్తామని దానికి కట్టుబడి ఉన్నామని ఇటీవలే కౌశిక్ రెడ్డి సొంత మండలమైన వీణవంక ప్రజలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించామని గుర్తు చేశారు.ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సోషల్ మీడియాలో హైప్ అవ్వడానికి కౌశిక్ రెడ్డి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు అన్ని ప్రజలు గమనిస్తున్నారని,కౌశిక్ రెడ్డి కేటీఆర్,హరీష్ రావు కు డ్రైవర్ ఆ లేక హుజురాబాద్ ప్రాంత ఎమ్మెల్యే నా అని ప్రశ్నించారు.కేటీఆర్,హరీష్ రావు ఇప్పటికైనా స్పందించి కౌశిక్ రెడ్డిని ఏదైనా మెంటల్ హాస్పిటల్ లో చేర్పించాలని కోరారు.బేషరతుగా తక్షణమే ఎమ్మెల్యే సంజయ్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# స్వచ్ఛంద సేవకుడు.... మాదాసు లింగయ్య..!

**కబురు న్యూస్, రామగిరి జనవరి 13:**



కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతినిత్యం స్వచ్ఛందంగా గత కొంత కాలంగా మండల కేంద్రంలోని రాంనగర్ కు చెందిన మాదాసు (పొట్టి) లింగయ్య సేవ చేస్తున్నారు. ఆ. అంబేద్కరుడిపై ఉన్న అభిమానం.. మమకారంతో.. ప్రతి నిత్యం అంబేద్కర్ విగ్రహం ప్రాంగాణంలో గల గడ్డి పెంపుదల కోసం నీళ్లు పట్టడంతో పాటు అందులో పెరిగే కలుపు మొక్కలను తొలిగిస్తూ... తనకు అంబేద్కర్ పై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నాడు. అతను పేదరికంలో ఉన్నా.. తన జీవనోపాధి కోసం కూలి పని చేస్తూ. కుటుంబాన్ని పోషించుకుంటూ.. జీవన ప్రయాణం సాగిస్తున్నాడు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో జనంలో ఒక్కడిగా పాల్గొంటూనే ఉంటాడు. వక్తల మాదిరిగా పెద్ద పెద్ద ఉపాన్యాసాలు అతను ఇవ్వక పోయిన.. కానీ అతను తన అభిమానాన్ని మాత్రం అంబేద్కర్ పై తన సేవతో చాటుతున్నాడు. అనూహ్య రీతిలో సోమవారం మాదాసు లింగయ్య అంబేద్కర్ విగ్రహం ప్రాంగాణంలో గల గరికలో కలుపు మొక్కలను తీసివేస్తూ.. ఆ గరికకు నీళ్లు పడుతూ కనిపించాడు. ఈ క్రమంలో అతన్ని పాలకరించగా.. ఈ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో పని చేయమని ఎవరైనా చెప్పారా.. కూలికి పని చేస్తున్నావా అని ప్రశ్నించగా.. అతను ఎమన్నాడంటే.. నేను ప్రతి నిత్యం వాకింగ్ కు వెళ్లే సమయంలో ప్రతి నిత్యం అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో గరిక తో పాటు మొక్కలకు నీలు పడుతుంటాను, అలాగే ఇందులో పెరిగే కలుపు మొక్కలను కూడ తొలిగిస్తుంటాను అని వెల్లడించారు. ఈ విషయం విని అక్కడ ఉన్నవారు హ్యాట్సాఫ్.. మాదాసు లింగన్న అంటూ ప్రతి ఒక్కరూ కొని ఆడారు.

# బాధితులకు అండ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం...

- రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రి వర్గం...
- మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్...

**కబురు న్యూస్, శంకరపట్నం జనవరి 13**

ఆర్థిక ఇబ్బందులు కొట్టుమిట్టాడుతూ మెరుగైన వైద్యం అందక బాధపడుతున్న బాధిత కుటుంబాలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తూ ప్రజాపాలన కొనసాగిస్తుందని కాంగ్రెస్ పార్టీ శంకరపట్నం మండల శాఖ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, మొలంగూర్ గ్రామంలో మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశం మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడు నేరెళ్ల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బసవయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా బసవయ్య గౌడ్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్





పార్టీ ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం ఎమ్మెల్యేలు ప్రజా పాలనే లక్ష్యంగా ప్రజలకు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందజేస్తున్నారని, అందులో భాగంగా పేద కుటుంబాలకు చెందిన వ్యక్తులు మెరుగైన వైద్యం కోసం ఆర్థికంగా ఖర్చు పెట్టుకోవడం జరుగుతుందని, వారికి ఆర్థికంగా అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వము ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా రాజకీయ బేషా జాలాలు లేకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలనను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీకి దినదినము ప్రజాదరణ పెరుగుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురాడానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తామని బసవయ్య గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీకట్ల కుమార్, రాయిని రమేష్, గాజుల మహేష్, తిరుపతి రెడ్డి, స్వామి రెడ్డి, మోరె పోశయ్య కల్లూరి సంతోష్, సాదిక్, తో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రధమ స్థానంలో నిలిచి.. పదివేల రూపాయల ప్రైజ్ మనీ అందుకున్న మల్లారెడ్డిపల్లి జట్టు...

## – ద్వితీయ స్థానం నిలిచిన వీణవంక జట్టు..

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 13.**

వీణవంక మండల కేంద్రంలో హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ హొర హోరీగా జరుగగా, మొదటి బహుమతి 10,000 వేల రూపాయలు మల్లారెడ్డిపల్లి జట్టు కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి వీణవంక జట్టు సాధించింది.ఈ పోటీలలో సుమారు 25 జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్ టోర్నమెంట్ లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను వీణవంక మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, తాళ్లపల్లి మహేష్ గౌడ్,ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ వెంకటేష్,సాగర్ రెడ్డి, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వాలీబాల్ క్రీడాకారులు ముజ్జు, కర్రె నాని, క్రాంతి, శ్రీకాంత్, సంతు, శ్యామ్,పవన్,రాజు,రాము,ప్రశాంత్, సురేష్,అనిల్, హరీష్,అఖిల్,చందు,గణేష్ కుమార్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.





తెలుగు దినపత్రిక కబురు KABURU TELUGU DAILY


## క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం లో కేపీఎస్ విద్యార్థులు




**కబురు న్యూస్,కోరుట్ల జనవరి 13.**
వివేకా నంద జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని కోరుట్ల పద్మశాలి సక్షేమ సంఘం పద్మశాలి యువత ఆధ్వర్యములో పద్మశాలి భవనములో వివేకానంద చరిత్ర ,మైథాలజీ మరియు వివిధ అంశాల యందు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అథి తులుగా కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ మండల విద్యాధికారి గంగుల నరేషం పాల్గొని మాట్లాడుతు వివేకానందుని ఆశయాలను అందరం ఆచరించాలని వారు చెప్పిన విషయాలను ముఖ్యంగా నేటి విద్యార్థులు ఆచరించి విద్యలో ముందు వరుసలో ఉండాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచిన కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కోరుట్ల ఎస్ ఐ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకొన్నారని పాఠశాల కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ,పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్ యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం స్కూల్ ప్రహరి గోడకు నిధులివ్వండి...



**కబురు న్యూస్, కోరుట్ల జనవరి13**
కోరుట్ల పట్టణం లో రెండో వార్డు హాజిపుర కాలనీ లో ఉర్దూమీడియం పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని,తాగుబోతులకు పోకిరీలకు అడ్డాగా తయారైందని,రాత్రిళ్ళు పొగరాయుళ్లు సిగరెట్ పీకలతో,గుట్కా ఉమ్ములతో నిండి ఉంటుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ వాసిద్ కోరుట్ల నియజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావుకు వినతిపత్రం అందజేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ను కోరారు. ఈ పాటశాలలో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని, టాయిలెట్స్ లేక విద్యార్థినులు ఇబ్బందులకు గురి ఆవుతున్నారని పాఠశాల కంపౌండ్ వాల్,మరుగుదొడ్లు నిర్మించి సమస్యలను వినతిలో ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వార్డు ఇంచార్జ్ అబ్దుల్ ముసిబిత్, 15వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎండి నజ్జు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా గోదాదేవి రంగ నాయకుల కళ్యాణం.



**కబురు న్యూస్, మెట్ పల్లి, జనవరి 13.**
మెట్ పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ కోదండా రామలయంలో సోమవారంశ్రీగోదాదేవి-రంగనాయకుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా బీఆర్ఏస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజనమ్మ దంపతులు పాల్గొన్నారు.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గారు పాల్గొని తలంబ్రాలను తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కళ్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ చైర్మన్ రణవేని సుజాత సత్యనారాయణ , వైస్ చైర్మన్ బోయిన్ పల్లి చంద్రశేఖర రావు , కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు...

## మెట్ పల్లి బస్టాండులో సంక్రాంతి సంబరాలు.

**కబురు న్యూస్, మెట్ పల్లి, జనవరి 13.**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి టీజిఎస్ఆర్ టి సి బస్టాండులో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు మెట్పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ అన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవరాజ్ మాట్లాడుతూ ప్రయాణికులకు భోగి సంక్రాంతి పండుగ ఫ్లెక్సీ పెట్టి రంగురంగుల ముగ్గులతో బస్టాండును ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రయాణికులకు శు భాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలోమెట్ పల్లి డిపో మేనేజర్ దేవరాజ్,బస్టాండ్ స్టేషన్ మేనేజర్ సురేష్, అశోక్ , ప్యాసింజర్ గైడ్ రాజేశ్వర్ గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.




# మూడవరోజు రిలే దీక్షలో పాల్గొని సంఘీభావాన్ని తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

**కబురు న్యూస్, నిజాంపేట్ జనవరి 13.**



నస్కల్ రోడ్డు నిర్మాణ పనుల కొరకై రిలే నిరాహార దీక్ష మూడవరోజులో భాగంగా సోమవారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి మండల బిఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్కల్, నగరం రాంపూర్, నందగోకుల్,గ్రామాలకు సంబంధించి బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 24 కోట్ల రూపాయల మంజూరు చేస్తేనే కల్వర్టు పూర్తి చేసుకుని మరమత్తు పనులు జరుగుతున్న సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో రోడ్డు పనులు పూర్తిగా ఆగిపోయాయని. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం కాలం గడుస్తున్న రోడ్డు విషయంలో ఎక్కడ వేసిన గొంగడిలా అక్కడనే ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వ తీరు కనిపిస్తుందన్నారు.గత ప్రభుత్వ హయాంలోనే మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,ఆధ్వర్యంలోనే పనులు పూర్తి అయ్యేవని ఎలక్షన్ కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయని. ఇప్పుడున్న ప్రభుత్వం మాటలకే పరిమితమవుతున్నారు కానీ అభివృద్ధి చేతుల్లో చూపించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నాలుగు గ్రామాల ప్రజలు రోడ్డు బాగోలేక నానా అవస్థలు పడుతున్న పట్టించుకపోవడం దారుణం అని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ సంగు స్వామి, రెడ్డి శెట్టి రవీందర్,మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి,చల్మెటి నాగరాజు,లచ్చపేట రాములు గౌడ్,నరేందర్,నగేష్,మల్లేష్,ఎల్లం యాదవ్, దుబాసి సంజీవ్,నరేష్ గౌడ్,బిక్షపతి,బజార్ తిరుమల్ గౌడ్,తాడెం మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలు, క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించిన - పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు...

**- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్.**

**కబురు న్యూస్, రామగుండం జనవరి, 13:**
పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత నగర్ విమాన శ్రయం మైదానంలో పాలకుర్తి మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు, క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ సతీమణి మనాలి టాగూర్ దంపతులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్, సతీమణి మనాలి ఠాగూర్ దంపతులు మాట్లాడుతూ ముందుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మహిళలు, యువకులు, ఆడపడుచులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ జనవరి 26 నుండి తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోతున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా మన ముందుకు రాబోతున్న కాలంలో పాలకుర్తి మండలం లోని ప్రజలకు, యువకులకు,మహిళలకు అందరికీ ప్రభుత్వ పథకాలు అమలు అయ్యే విధంగా చూస్తామని, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు ఒక్క గింజ తరుగు లేకుండా వారి ధాన్యం కొనుగోలు చేసి సన్నలకు 500 బోనస్ ఇచ్చిన ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందేనని, అతి త్వరలో పాలకుర్తి రిజర్వాయర్ తీసుకువచ్చి రైతుల ప్రతి ఎకరానికి నీరు అందించి రైతుల గుండె లోఉన్న బా రాన్ని తొలగించి వారి కుటుంబాలకు మీ రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ ముందుంటాడని, బండల వాగు ప్రాజెక్టు సుమారుగా 250 కోట్ల వ్యాయామంతో పూర్తి చేసుకున్నామామి, ఇట్టి విషయాన్ని తెలంగాణ భారీ నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి ఇదివరకే మన రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ తీసుకు వెళ్లడం జరిగిది. కావున పాలకుర్తి మండలంలోని ప్రజలు వారికి సమయం ఎప్పుడు ఇస్తే అప్పుడు బండల వాగు ప్రాజెక్టు ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడానికి సిద్ధంగా రాజు ఠాగూర్ ఉన్నాడని రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ సతీమణి మనాలి ఠాగూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వీధి రౌడీ లా ప్రవర్తించిన పాడి కౌశిక్ రెడ్డి

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

**కబురు న్యూస్,కోరుట్ల జనవరి 13**
జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇతర అధికారులపై దౌర్జన్యం చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేసి మరే ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు నిన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి సమావేశంలో జగిత్యాల శాసనసభ్యుడు సంజయ్ కుమార్ పై దౌర్జన్యం చేసినటువంటి హుజురాబాద్ఎమ్మెల్యే కు రాజకీయ పరిజ్ఞానం లేదని అతను అభివృద్ధి సమీక్ష మండలి సమావేశంలో శాసనసభ్యులకు మాట్లాడే అవకాశం ఉంటుందని అభివృద్ధిని సమీక్ష చేసే అవకాశం ఉంటుందని కానీ అతను ఏ పార్టీకి చెందిన వ్యక్తి అతనికి మైకెందుకు ఇచ్చారు అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను ఉద్దేశించి కౌశిక్ రెడ్డి అనడం దౌర్జన్యం చేయడం అతనికి మైకెందు ఇచ్చారని అనడం విడ్డూరంగా ఉందని కనీస పరిజ్ఞానం కూడా లేనటువంటి వ్యక్తి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అని అన్నారు డిడిఆర్సి సమావేశంలో అభివృద్ధి విషయాలపై సమీక్ష చేయాలని కానీ పలానా రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తికే పలనా రాజకీయ పార్టీ శాసనసభ్యుడికిమాత్రమే మైక్ ఇవ్వాలని ఎక్కడ ఉండదని ఈ మాత్రం జ్ఞానం లేని వ్యక్తి శాసనసభ్యుడుగా అనర్హుడని ఇతను శాసనసభ్యుడుగా కాకుండా వీధి రౌడీగా ప్రవర్తిస్తున్నాడనిజువ్వాడి కృష్ణారావు అన్నారుహుజురాబాద్ శాసనసభ ఉప ఎన్నికల్లో అప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి కోవర్ట్ రాజకీయాలు నేరపి టిఆర్ఎస్ లో ఎమ్మెల్సీ పదవి పొందినటువంటి కౌశిక్ రెడ్డి విషయం ప్రజలందరికీ తెలుసని 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో హుజురాబాద్ లో పోటీ చేస్తూ తనకు ఓటు వేయకపోతే తాను తన కుటుంబ సభ్యుల ఆత్మహత్య చేసుకుంటామని నియోజకవర్గ ప్రజలను బ్లాక్ మెయిల్ చేశాడని ఈ విషయంలో కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి ఉపాధ్యక్షులు ఎం ఏ నయిం జిల్లా బి సి సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్ ఏలేటి మహిపాల్ రెడ్డి జిల్లా మైనారిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎం ఏ వసి ఉర్ రహమాన్ తెడ్డు విజయ్ షకీల్ మాజీ కౌన్సిలర్ సోగ్రాభి కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్ గౌడ్ పసుల కృష్ణప్రసాద్ చిట్యాల లక్ష్మీనారాయణ ముక్కెర లింబాద్రి ఎం డి సోహైల్ ఎం డి రియాజ్ ఎం డి వసీద్ ఎం డి అయూబ్ ఎల్లల వెంకట్ రెడ్డి బుస రాజేశ్వర్ సారు సురేష్ సురకంటి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కబురు న్యూస్, నిజాంపేట్ జనవరి 13.**
నిజాంపేట మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన కసిన్య నాయక్ గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, సోమవారం బాధిత కుటుంబానికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్,రాజు,శ్రీను,ఆంజనేయులు, అంజాగౌడ్, ఎర్ర మల్లయ్య, నరేందర్ నాయక్,విట్టల్, యాదగిరి,రవి,సత్యం, దేవనందం,రాజు,జైపాల్, నక్కరాజు,మల్లేశం,రమేష్, తదితరులు పాల్గొన్నారు...



కబురు
తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
KABURU TELUGU DAILY





# అదితి, అర్జున్ జోడీగా?

**కబురు సినిమా జనవరి 13:** గతేడాది 'హీరామండీ' వెబ్‌సిరీస్‌లో తన నటనతో కట్టిపడేసిన బాలీవుడ్ తార అదితి రావ్ హైదరీ.. ఇప్పుడు మరో కొత్త సిరీస్‌తో రావడానికి సిద్ధమవుతోంది. ఆమె, అర్జున్ రాంపాల్ జంటగా 'ఓ సాథి రే' అనే వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి 'లైలా మజ్ను' ఫేమ్ సాజిద్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. "సినిమాలతో పాటు.. సిరీస్‌లతోనూ ఓటీటీ వేదికగా సత్తాచాటుతున్న అదితి.. ఈ రొమాంటిక్ డ్రామాలో మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనుంది. వివాహేతర సంబంధం చుట్టూ తిరిగే ఈ సిరీస్‌ను ఇంతియాజ్ అలీ నిర్మించనున్నారు. ఇందులో అదితి, అర్జున్‌ల జోడీ అలరించేలా ఉంటుంది. పూర్వనిర్మాణ పనుల్లో ఉన్న ఈ సిరీస్ చిత్రీకరణను ఫిబ్రవరిలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని అదితి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# 'గేమ్ ఛేంజర్' విషయంలో బెదిరింపులు.. ఫిర్యాదు చేసిన చిత్ర బృందం

**కబురు సినిమా జనవరి 13:** తాము అడిగినంత డబ్బు ఇవ్వకపోతే 'గేమ్ ఛేంజర్' సినిమాని లీక్ చేస్తామంటూ బెదిరించిన వారిపై చిత్ర బృందం సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.సినిమా విడుదలకు ముందు నిర్మాతలతో పాటు టీమ్‌లోకి కొందరు కీలక వ్యక్తులకు వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు వచ్చాయి. అడిగిన మొత్తాన్ని ఇవ్వకపోతే మూవీని లీక్ చేస్తామంటూ కొందరు బ్లాక్ మెయిల్ చేశారు. మూవీ రిలీజ్‌కు రెండు రోజుల ముందు కీలక సన్నివేశాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మరోవైపు, సినిమా రిలీజైన రోజే ఆన్‌లైన్‌లో లీక్ చేశారు. ఆధారాలు సేకరించిన చిత్ర బృందం.. 45 మందితో కూడిన ముఠాపై తాజాగా ఫిర్యాదు చేసింది. ఈ ముఠా వెనుక ఉన్నదెవరు? అనే కోణంలో పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్టు సమాచారం.మరోవైపు, సోషల్ మీడియా వేదికగా సినిమాపై నెగెటివిటీ సృష్టిస్తున్న కొన్ని ఖాతాలపైనా 'గేమ్ ఛేంజర్' టీమ్ కంప్లైంట్ ఇచ్చింది. రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రమిది. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న బాక్సాఫీసు ముందుకొచ్చింది.




# కుటుంబంతో కలిసి చూడండి.. హాయిగా నవ్వుకుంటారు: వెంకటేశ్



**కబురు సినిమా జనవరి 13:** 'సంక్రాంతికి వస్తున్నాం'తో కడుపుబ్బా నవ్వించనున్నాం అంటున్నారు కథానాయకుడు వెంకటేశ్ . ఆయన.. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి నాయకానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కించారు. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా మంగళవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ పేరుతో ఓ వేడుకను నిర్వహించారు.ఈ సందర్భంగా హీరో వెంకటేశ్ మాట్లాడుతూ.. "ఇది నా 76వ సినిమా. అనిల్ చాలా అద్భుతమైన స్క్రిప్ట్‌తో వచ్చారు. ఇందులో బోలెడంత వినోదం ఉంది. అనిల్ ప్రతి సీన్‌ను అద్భుతంగా తెరకెక్కించారు. కుటుంబంతో కలిసి థియేటర్లో సినిమా చూడండి. హాయిగా నవ్వుకుంటారు" అన్నారు. "ఈ చిత్రంలో చాలా విభిన్నమైన అంశాలున్నాయి. ప్రేక్షకులు కొత్తగా ఫీలయ్యే కామెడీ ఉంది. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఎంటర్‌టైనర్ అవుతుంది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ కార్యక్రమంలో వెంకీ స్వయంగా పాట పాడి అభిమానుల్ని అలరించారు. ఈ వేడుకలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య, రమణ గోగుల, దిల్‌రాజు, శిరీష్, భీమ్స్ సిసిరోలియో తదితరులు పాల్గొన్నారు.

# ఈ క్షణాలు మరిచిపోను దుబాయ్‌లో అజిత్‌కుమార్



**కబురు సినిమా జనవరి 13:** కోలీవుడ్‌లో మల్టీ టాలెంటెడ్ స్కిల్స్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అజిత్‌కుమార్. ఈ స్టార్ యాక్టర్ సినిమాలతో కోట్లాది మంది అభిమానులకు వినోదాన్ని అందించడమే కాదు తన రేసింగ్ స్కిల్స్‌తో యావత్ భారతదేశ గొప్పతనాన్ని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పాడు. దుబాయ్ 24 సిరీస్‌లో భాగంగా అజిత్ కుమార్ టీం జరిగిన ఎండ్యూరెన్స్ రేసు లో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ రేసింగ్‌లో అజిత్ కుమార్ టీం పోర్చే 992 కేటగిరీలో 3వ స్థానంలో నిలువగా.. దుబాయ్ 24 సిరీస్‌లో 23వ ప్లేస్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అజిత్ కుమార్ రెపరెపలాడుతున్న మువ్వన్నెల జాతీయ జెండాను పట్టుకొని గ్యాలరీవైపుకు ఆనందంతో పరుగెత్తుకొచ్చాడు. అందరికీ భారత జెండాను చూపిస్తూ దేశమంతా గర్వించేలా చేశాడు. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కార్ రేసింగ్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచిన అజిత్ కుమార్ టీంకు అభిమానులు, ఫాలోవర్లు, రేసింగ్ లవర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొన్ని రోజులుగా దుబాయ్ కార్ రేసింగ్ కోసం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంటుడగా అజిత్ కారు ట్రాక్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టడంతో భారీ ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో బయటపడ్డ అజిత్ కుమార్ తన టీంతో కలిసి ఏ మాత్రం తగ్గేదేలా అంటూ సత్తా చూపించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాడు.

# గల్లీ బాయ్ 2 సన్నాహాలు?

**కబురు సినిమా జనవరి 13:** ముంబయి మురికివాడల్లో నివసిస్తూ ర్యాప్ సింగర్ కావాలని కలలు కనే మురాద్ అనే అబ్బాయి జీవితం చుట్టూ తిరిగే చిత్రం 'గల్లీ బాయ్'. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్, అలియా భట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జోయా అక్తర్ తెరకెక్కించారు. ఇందులో ఏదో రోజు మనకి కూడా సమయం వస్తుందని నమ్మే గల్లీ బాయ్‌గా అదరగొట్టారు రణ్‌వీర్. 2019లో విడుదలైన ఈ సినిమాకు కొనసాగింపుగా 'గల్లీ బాయ్ 2'ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో అందాల తార అనన్య పాండే, విక్కీ కౌశల్ నాయకానాయికలుగా కనిపించనున్నట్లు సమాచారం. "ఖో గయే హమ్ కహాన్' ఫేమ్ అర్జున్ వరైన్ సింగ్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఇందులో నటించడానికి విక్కీ, అనన్య ఉత్సాహంగా ఉన్నారు. వీరిద్దరి జోడీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా కనిపిస్తుంది. మునుపెన్నడూ పోషించని శక్తిమంతమైన పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని మొదలు పెట్టింది చిత్రబృందం" అని విక్కీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kabarueveningdaily9106@gmail.com